సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 28 । జూన్ । 2024



అభివృద్ధి పనులు వేగవంతం
పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావు ఆదేశించారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
సింహాచలం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి 8లో



గిరి నాగు హల్‌చల్
దేవరాపల్లి మండలం రైవాడలో హల్‌చల్ చేసిన గిరి నాగును స్నేక్ క్యాచర్ పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. 8లో

రేషన్‌కు తిప్పలే!

రేషన్‌కార్డుదారులకు మళ్లీ కష్టాలు మొదలైనట్టే. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన టీడీపీ ప్రభుత్వం ఒకటో తేదీ నుంచి డీఆర్ డిపోల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు చేస్తోంది. రేషన్ తెచ్చుకునేందుకు శివారు గ్రామాల ప్రజలు తిప్పలు పడాల్సిందే. దీనిపై అన్ని వర్గాల నుంచి సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

- ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థ రద్దుతో కష్టాలు
- మారుమూల గ్రామాల గిరిజనులకు తప్పని అవస్థలు
- మళ్లీ పాతరోజులను గుర్తుచేసుకుంటున్న లబ్ధిదారులు

గత కష్టాలు మళ్లీ మొదలు



నాపేరు మర్రి నాగేశ్వరరావు. మాది హుకుంపేట మండలంలోని ఓలుబెడ్డ గ్రామం. మూడు కిలోమీటర్ల దూరంలోని తీగల వలస డిపోకు కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకునేవాడిని. ఎప్పుడు ఇస్తారో తెలియక చాలాసార్లు తిరగాల్సి వచ్చేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ గ్రామానికి రోడ్డు నిర్మించింది. ఎండీయూ వాహనం ద్వారా రేషన్‌ను ఇంటివద్దకే సరఫరా చేయడంతో అవస్థలు తప్పాయి. ఇప్పుడు మళ్లీ డిపోనుంచి తెచ్చుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.

ఐదు కిలోమీటర్లు వెళ్లాలి



నాపేరు వంతల కిందో, మాఊరు అరకు వేలీ మండలంలోని గంగగుడ్డి. గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని రాగానే ఇంటింటికే రేషన్ అందించడంతో కష్టాలు తీరాయి. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం డిపోల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని చెబుతోంది. దీంతో గంటలకొద్ది డిపోల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి. డీఆర్ డిపో నుంచి రేషన్ తెచ్చుకోవాలంటే తప్పనిసరిగా ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే.



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హుకుంపేట మండలం మట్టుజోరు డిపో నుంచి రేషన్ బియ్యాన్ని మోసుకువెళ్తున్న గిరిజనులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుత్తులపుట్టులో ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్ద రేషన్ సరకులు పొందుతున్న గిరిజనులు

సాక్షి,పాడేరు/రంపచోడవరం/అనంతగిరి/చింతూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి నిత్యావసరాలు సకాలంలో అందించాలనే లక్ష్యంతో ఎండీయూ వాహనాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లావ్యాప్తంగా 221 వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేసేది. వాహనాలను స్థానిక యువతకు అందజేయడం ద్వారా వారికి స్వయం ఉపాధి కల్పించింది. ఇంటి ముంగిటకే రేషన్ సరకులు అందడంతో కాలినడక, రోజులతరబడి డీఆర్ డిపోల చుట్టూ తిరిగడం, మోత కష్టాలు దూరమయ్యాయి. జిల్లాలో 2,98,092 రేషన్‌కార్డు దారులు ఉన్నారు. సెల్ టవర్ల ఏర్పాటుకు నెట్ వర్క్ సమస్య పరిష్కారమైంది. సుమారు 85 శాతం మేర ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరాకు మంగళం పాడింది. డీఆర్ డిపోల వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

ఎండీయూ వ్యవస్థకు మంగళంతో..

- వీఆర్‌పురం మండలం శ్రీరామగిరి పంచాయతీలోని చొక్కనపల్లికి చెందిన లబ్దిదారులు ఎండీయూ వాహనాల రద్దుతో రేషన్ సరకులు తీసుకునేందుకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని శ్రీరామగిరికి కాలినడకన వెళ్లాలి.
- కూనవరం మండలం పెదార్కూరు పంచాయతీలోని గండికొత్తగూడెంకు చెందిన 74 మంది రేషన్ కార్డుదారులు ఐదు కిలోమీటర్ల దూరంలోని పెదార్కూరు కాలినడకన వచ్చి రేషన్ సరకులు తీసుకోవాలి.
- ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ పరిధిలోని ఎర్రగట్టుకు చెందిన రేషన్ లబ్దిదారులు ఇబ్బందులు పడాల్సిందే. వీరంతా 15 కిలోమీటర్ల దూరంలోని వినాయకపురం కాలినడకన వచ్చి తీసుకోవాలి.
- చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పరిధిలోని చౌలూరుకు చెందిన రేషన్ లబ్దిదారులకు ఎండీయూ వాహనం ద్వారా ఇంటివద్దకు సరకులు అందేవి. ఇప్పుడు కంసులూరుకు వాగుదాటి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకోవాలి.
- హుకుంపేట మండలంలోని తీగలవలస డీఆర్ డిపో పరిధిలో కిన్నెరలోవ, పనసబంద, ఓలుబెడ్డ, అంబవాడ, పంతలచింత, నిమ్మలగొంది, కోళ్లమామిడి, కరకపుట్టు, గాలిపాడు గ్రామాలు ఉన్నాయి. వీరంతో రేషన్ కోసం పది కిలోమీటర్లు వెళ్లాలి.
- మండల కేంద్రమైన అనంతగిరి డిపో పరిధిలో తాటిగూడ, తలారిపాడు, పూలుగూడ, తెనెపుట్టు, పాతకోట, మాలింగవలస, రేగం, డెక్కాపురం, లక్ష్మీపురం, బరజోల, మెండిజామిగుడ గ్రామాలు ఉన్నాయి. వీరంతా రేషన్ తెచ్చుకునేందుకు ఐదు నుంచి పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది.
- పెదబయలు మండలంలోని బొంగరం డీఆర్ డిపో పరిధిలో నిట్టపుట్టు, జంగలవీధి, అగరవీధి, దేవరాజుమేరకలు, చదురుమామిడి, వేలంగరువు, వెదురుగొయ్యి, దోమలొట్టు, బొంగరం, కుంటుమామిడి, పోతులగరువు, అమిడేలు, పారమలమ్మ గ్రామాలు ఉన్నాయి. ఐదు పది కిలోమీటర్లు వెళ్తేనే రేషన్ సరకులు దక్కేది.
- డుంబ్రిగుడ డిపో పరిధిలో ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో తోటవలస, బోడుగుడ,పంతెలిచింత, అంత్రేగుడ, పెదపాడు, చంపాపట్టి, పనసపుట్టు, కోసంగి, అంత్రిగూడ, సంతవలస, లివిటిపుట్టు, సింధిపుట్టు, కొత్తవలస, చెలిమరవలస, అమలగూడ, బీజుమరవలస, దవడగూడ, గొందిగూడ, బిల్లపుట్టు, ఉయ్యాలగూడ, శీలంగొంది గ్రామాలు ఉన్నాయి. వీరంతా రేషన్ కోసం మండల కేంద్రానికి రావాల్సిందే.
- అరకువేలి మండలం లోని మాడగుడ డీఆర్‌డిపోకు ఐదు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఎంఅట్టగుడ, బోడుగుడ, దళపతి, డింగ్రిపుట్టు, నందిగూడ, హట్టగూడ గ్రామాలు ఉన్నాయి. రేషన్ కోసం వీరంతా అవస్థలు పడాల్సిందే.
- పాడేరు మండలంలోని మోదాపల్లి, గుర్రగరువు, చల్దిగెడ్డ,సంగోడి గ్రామాల రేషన్ కార్డుదారులు మూడు కిలోమీటర్ల దూరంలోని డిపో పరిధిలో మినుములూరు డిపోకు వెళ్లాలి.
- కొయ్యూరు మండలం పైడిపనుకులు, దుక్కులబంద, గంగవరం, శాంతినగరం గ్రామాల రేషన్‌కార్డుదారులు నాలుగు కిలోమీటర్ల దూరంలో మంప డిపోకు వెళ్లాలి.
- జీకే వీధి మండలంలోని చిన అగ్రహారం,పెద అగ్రహారం,వాడమామిడి,చీడిగొంది గ్రామాల ప్రజలు రేషన్‌ను నాలుగు కిలోమీటర్ల దూరంలోని కుంకుమపూడి డిపోనుంచి తెచ్చుకోవాలి.
- ఇంటింటికీ రేషన్ రద్దుతో రంపచోడవరం మండలంలో రేషన్ కార్డుదారులు ఐదు నుంచి ఆరో కిలోమీటర్ల కాలినడకన డిపోలకు వెళ్లి సరకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గెద్దాడ పంచాయతీ పరిధిలోని చెరువుపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు నాలుగు కిలోమీటర్లు నడిచి పెద్దగెద్దాడలో డిపో నుంచి రేషన్ తెచ్చుకోవాలి. సోకులగూడెం, దబ్బవలస గ్రామ గిరిజనులు ఏడు కిలోమీటర్లు దూరంలోని పెదగెద్దాడ జీసీసీ డిపోకు రావాలి.



రేషన్ సరకుల కోసం వాగు దాటుతున్న చింతూరు మండలం చౌలూరు గిరిజనులు (ఫైల్)



భీంపోల్ డీఆర్‌డిపో నుంచి కాలినడకన రేషన్ తెచ్చుకుంటున్న లువ్వా గ్రామ మహిళలు (ఫైల్)

సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యం



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దినేష్‌కుమార్‌తో జేసీ భావన, ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్లు, డీఆర్వో

- గిరిజనుల సమస్యల పరిష్కారమే ధ్యేయం
- ఏజెన్సీ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన
- కొత్త కలెక్టర్ దినేష్‌కుమార్
- బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యమని కొత్త కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేసింది. ముందుగా ఆయన ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు,పాడేరు పట్టణంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కలెక్టర్ ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు. అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు. కలెక్టర్‌కు జేసీ భావన వశిష్ట, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, చైతన్య, సబ్‌కలెక్టర్లు ప్రశాంత్‌కుమార్, ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీ శర్మ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. స్వాతంత్ర సమర యోధుడు అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు.

అల్లూరి కలెక్టర్‌గా నియామకం ఎంతో సంతోషం

ఐఏఎస్ 2013 బ్యాచ్‌కు చెందిన తాను ప్రకాశం కలెక్టర్‌గా 2022 నుంచి ఇప్పటివరకు పనిచేశానని, అక్కడి నుంచి కలెక్టర్‌గా ఇక్కడికి బదిలీ కావడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బదిలీ అవ్వడం సంతోషంగా ఉందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. గతంలో తాను రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేశానని, రంపచోడవరం,చింతూరు ఐటీడీఏల పరిధిలోని గిరిజన ప్రాంత సమస్యలపై అవగాహన ఉందన్నారు.

గిరిజనుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజనుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని గ్రామాలకు రోడ్లు, మొబైల్ కనెక్టివిటి, తాగునీటి సౌకర్యాలు మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యావ్యవస్థ పటిష్టతకు సమీక్షలు

ప్రభుత్వ పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లోను విద్యావ్యవస్థ పటిష్టతకు నిత్యం సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు.ఉపాధి హామీ పథకంలో గిరిజనులకు ఉపయోగపడే పనులనే చేపడతామన్నారు.జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తామని ఆయన తెలిపారు.

స్థానికంగానే ఉండాలి

అధికారులంతా స్థానికంగానే అందుబాటులో ఉండాలని.ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. గోదావరి వరద ముంపు ప్రాంతాలలో బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని, వరదలను సమర్థంగా ఎదుర్కొంటామని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలపై అధికార యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎడ్‌సెట్‌లో సీలేరు విద్యార్థినికి ఐదో ర్యాంక్



రేష్మ

సీలేరు: బీఈడీలో ప్రవేశానికి నిర్వహించిన ఎడ్‌సెట్‌లో సీలేరు విద్యార్థి రేష్మ జీవశాస్త్రం విభాగంలో ఐదో ర్యాంకు సాధించింది. ఈమె ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ చదివింది. తండ్రి చిటికెల సత్యనారాయణ సీలేరు ఏపీ జెన్‌కోలో ఉద్యోగం చేస్తున్నారు. ఒకటి నుంచి టెన్త్ వరకు సీలేరులో, ఇంటర్ విజయవాడ నారాయణ కళాశాలలో చదివింది. పాయకరావుపేట శ్రీప్రకాష్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఎడ్‌సెట్‌లో జీవశాస్త్రం విభాగంలో ఐదో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఆమెను అభినందించారు.

గోదావరికి వరద పోటు

- నిలిచిపోయిన పాపికొండల విహారం



పోశమ్మగండి వద్ద గోదావరి నీటిమట్టం

దేవీపట్నం: తుఫాను ప్రభావంతో నదిపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొండవాగుల ద్వారా గోదావరిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో పోశమ్మగండి వద్ద నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మూడు రోజులుగా సుమారు నాలుగు అడుగులు పెరిగినట్టు పరిసర ప్రాంతీయులు చెబుతున్నారు. ఇలా ఉండగా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పోశమ్మగండి నుంచి పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి నిలిపివేశారు.

వీఆర్‌పురం: తుఫాను కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద పాపికొండల పర్యాటక బోట్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు బోట్ యూనియన్ నాయకులు తెలిపారు.

రేషన్ పంపిణీలో రాజకీయాలొద్దు

- ఎండీయూ సేవల రద్దుతో గిరిజనులకు అన్యాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: ప్రతీ ఇంటికి నిత్యావసరాలు అందించే ఎండీయూ వాహనాల విషయంలో రాజకీయాలు వద్దని, ఎంతో సౌకర్యవంతమైన వ్యవస్థను రద్దు చేస్తున్నామని మంత్రి సంధ్యారాణి ప్రకటించడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ధ్వజమెత్తారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎండీయూ వాహనాలతో గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రోడ్డున్న ప్రతి గ్రామంలోను ఇంటింటికే బియ్యం, ఇతర సరుకులు అందేవన్నారు. ఎండీయూ వాహనా లు కూడా స్థానిక గిరిజనులకు ఇవ్వడంతో వారంతా స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి డీఆర్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తే గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. దూర ప్రాంతాల్లోని డిపోలకు కాలినడకన వెళ్లి సరకులు మోసుకువచ్చే పరిస్థితి బాధాకరమన్నారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని పక్షంలో గిరిజనుల ఆగ్రహం తప్పదని ఆమె హెచ్చరించారు.

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికీ రేషన్‌ను సరఫరా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో వ్యవహరించి ఇంటింటికీ రేషన్ పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా ప్రత్యేకంగా ఎండీయూ వాహనాలు ఏర్పాటుచేసి పంపిణీకి ఆపరేటర్లను నియమించిందన్నారు. దీంతో ఇంటింటికీ సజావుగానే ఇప్పటివరకూ పంపిణీ జరిగిందన్నారు. ఈ వ్యవస్థ లేకముందు గిరిజనులు రేషన్‌సరకుల కోసం సుమారు 10 కిలోమీటర్ల మేర కాలినడకన డిపోలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. మైదాన ప్రాంతాలతో పోలిస్తే గిరిజన ప్రాంతాల్లో గ్రామాలు సుదూర ప్రాంతాల్లో ఉంటాయన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఉన్న ఫళంగా రేషన్ పంపిణీ విషయంలో ఆపరేటర్లను తొలగించేందుకు సిద్ధపడిందన్నారు. ఇది అమలైతే ఆపరేటర్లు ఉపాధి కోల్పోవడమే కాకుండా రేషన్ పొందేందుకు గిరిజనులు ఇబ్బందులు పడతారన్నారు.

నేడు ఆదివాసీ జేఏసీ అత్యవసర సమావేశం

పాడేరు : ఆదివాసీ జేఏసీ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు పాడేరు గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంతానికి ప్రత్యేక వెసులుబాటు కల్పించి శతశాతం ఉద్యోగాలు స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని, ఏజెన్సీలో ఉద్యోగాల భర్తీపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేయడం, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లే అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి జేఏసీ సభ్య సంఘాల సభ్యులు, రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, నిరుద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.



కొయ్యూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ

స్తంభించిన జనజీవనం

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ఉధృతంగా వాగులు, గెడ్డలు
- 460.4 ఎంఎం వర్షపాతం నమోదు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వాగులు ,గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 460.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.అత్యధికంగా ముంచంగిపుట్టులో 156.2,అరకులోయలో 58.4,అనంతగిరిలో 49.6,పెదబయలులో 35.2, హుకుంపేటలో 18.4, కూనవరంలో 16.2, కొయ్యూరులో 16.2, జి.కే.వీధిలో 15.8, డుంబ్రిగుడలో 14.6, ఎటపాకలో 5.2, చింతూరులో 10.8, మారేడుమిల్లిలో 8.6, దేవీపట్నంలో 7.6,వై.రామవరంలో 3.4,అడ్డతీగలలో 4.4, రాజవొమ్మంగిలో 6.8, గంగవరంలో 6.8, రంపచోడవరంలో 5.4 వీఆర్‌పురంలో 2.4, పాడేరులో7.6, జి.మాడుగులలో 4,6, చింతపల్లిలో 6.2 ఎంఎం నమోదైంది.

గూడెంకొత్తవీధి: మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకూ కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఒడిశా, తెలంగాణకు వెళ్లే అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిలో బలహీనంగా ఉన్న కల్వర్టులపైనుంచి పొంగి ప్రవహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంట భూములు నీటమునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొయ్యూరు: భారీ వర్షాలకు మండలంలోని యూ చీడిపాలెం పంచాయతీలో మర్రిపాలెం, పలకజీడి ప్రాంతాల్లో కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొయ్యూరు, కాకరపాడు కాలువల్లో భారీగా వరదనీరు చేరింది.

రాజవొమ్మంగి: మండలంలో వర్షం దంచికొట్టింది. అప్పలరాజుపేట – కిమ్మిలిగెడ్డ మార్గంలోని పొంగి ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు నీరంతా వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో చేరడంతో నీటిమట్టం మూడు అడుగులకు చేరింది. శరభవరం, రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోని చిన్నకాలువ, కబర్మతి, పులిగొమ్ము కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయి. లబ్బర్తి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

చింతపల్లి రూరల్: మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. గిరిజనులు ఇళ్లకు పరిమితం అయ్యారు.



చింతపల్లిలో కురుస్తున్న వర్షం



గూడెంకొత్తవీధిలో వంతెనను తాకేలా ప్రవహిస్తున్న వరదనీరు



గూడెంకొత్తవీధిలో నీటమునిగిన పంట పొలాలు



అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో పొంగి ప్రవహిస్తున్న వట్టిగెడ్డ వాగు

సమస్యల పరిష్కారానికి మీకోసం

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై వినతులు స్వీకరించేందుకు జిల్లాలోని పాడేరు,రంపచోడవరం,చింతూరు ఐటీడీఏలో మీకోసం ప్రారంభిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలు పాడేరు కలెక్టరేట్‌కు రాలేని పరిస్థితి దృష్ట్యా ఆయా ఐటీడీఏల పరిధిలోనే అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వెంటనే పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. ప్రతీ శుక్రవారం పాడేరు ఐటీడీఏ, సోమవారం రంపచోడవరం ఐటీడీఏ, బుధవారం చింతూరు ఐటీడీఏలో మీకోసం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నామనితెలిపారు. ప్రతీరోజు 24గంటలు నిరంతరం పనిచేస్తుందని,అధికారులు,సిబ్బంది ఈ ప్రత్యేక సెల్‌లో ఉంటారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 08935-293120కు ప్రజలు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు ఐటీడీఏలో మీకోసం: స్థానిక ఐటీడీఏలో నేటి నుంచి ప్రతి శుక్రవారం వారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) పనిచేస్తుందని కలెక్టర్ దినేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని,జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలోని సామాజిక పింఛన్ల పంపిణీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గురువారం తన కార్యాలయం నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు,వెలుగు అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి వారికి సూచనలు ఇచ్చారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం

- విద్యాశాఖ ఏడీ అప్పారావు

ముంచంగిపుట్టు: పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావు ఆదేశించారు. మండల కేంద్రంలో గురువారం అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో ఎంఈవో కృష్ణమూర్తి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని, నిబంధనలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ప్రతి రోజు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్ చేయాలని, పాఠశాల రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు అందించాలని, పాఠశాల నిర్వహణ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శివపాత్రుడు,సీఎంవో జ్ఞాన ప్రకాష్, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

- అధికారుల క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక



హాజరైన అన్ని శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై జేసీ, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే అధికారుల లక్ష్యమని, విధుల్లో ఎక్కడ అలసత్వం, నిర్లక్ష్యంతో వ్యవహరించిన ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన గురువారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలోని అధికారులు వర్చువల్ విధానంలో ఈ సమావేశానికి హాజరయ్యారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం

ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాపై తనకు అవగాహన ఉందని, అన్ని శాఖల అధికారులంతా విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, జాప్యం లేకుండా ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలని, విద్య, వైద్యం, ఆరోగ్య సేవలు విస్తృతం చేయాలని సూచించారు. విద్యాలయాల్లో పాఠ్య ప్రణాళికలను పకడ్బందీగా అమలుజేయాలని, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. ఈ ఏడాది పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయని, సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని, మాస్‌కాపీయింగ్ జరగకూడదన్నారు.

మీ కోసం వినతులు ఆన్‌లైన్‌లో నమోదు

దోమల నివారణకు సంబంధించి రెండవ విడత దోమల మందు పిచికారీ పనులు పక్కాగా జరగాలని ఆదేశించారు. ఈ మేరకు వీఆర్వోలు, వైద్యసిబ్బంది, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తల భాగస్వామ్యంతో పిచికారి పనులు విజయవంతం చేయాలన్నారు. మీకోసం ఫిర్యాదులు పరిష్కారం కార్యక్రమం వినతులన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు.ఉపాధి హామీ పథకం పనుల్లో అనవసర సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం పనులకు ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలని, కూలీలకు కూలి సొమ్ము చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం చేసిన ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.అన్ని ఇంజనీరింగ్‌శాఖల పనులపై ప్రత్యేకంగా సమీక్షిస్తానన్నారు. తుపాను వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జేసీ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌లు ప్రశాంత్‌కుమార్, ధాత్రిరెడ్డి, ఆర్‌డీవో చైతన్య, డీఆర్‌వో పద్మావతి, ఎస్‌డీసీలు శర్మ,భవానీ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఈవో బ్రహ్మాజీరావు, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీహెచ్‌వో రమేష్‌కుమార్‌రావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈలు రాజు, వేణుగోపాల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు



భీమవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ

అనంతగిరి : మలేరియా ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో మలేరియా కేసులు నమోదైతే క్షేత్రస్థాయిలో నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ స్పష్టం చేశారు. ఆమె మండలంలోని మారుమూల భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ఎపిడమిక్ సీజన్ దృష్ట్యా సిబ్బంది ఎమరుపాటుగా ఉండొద్దన్నారు. గత ఏడాది మలేరియా ప్రబలిన గ్రామాల్లో కూడా ప్రత్యేక నిఘాతో ఉండాలన్నారు. దోమల ద్వారా వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెల్త్ సూపర్‌వైజర్లకు సూచించారు. జూలై 1వ తేదీ నుంచి జరిగే మలేరియా పిచికారీ పట్టింగా చేయాలన్నారు. ఆవాసాల లోపల కూడా పిచికారీ జరిగేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం ఆమె అనంతగిరి పీహెచ్‌సీ పరిధిలోని మండపర్తి, గుంఢ్రంగిపాడు గ్రామాలను సందర్శించారు. ఆమె వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి ఏజే సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి బి.బాబూరావు, సిబ్బంది ఉన్నారు.

తంగేళ్లబందలో పాఠశాల ఏర్పాటుకు వినతి



గెడ్డ వద్ద వేచి ఉన్న తంగేళ్లబంద విద్యార్థులు

అనంతగిరి: మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ తంగేళ్లబందలో పాఠశాల ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గ్రామంలో 25 మంది విద్యార్థులు ఉన్నారని, వీరంతా రెండు కిలోమీటర్ల దూరంలోని గంగవరం ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారని తెలిపారు. వర్షకాలం కావడంతో గ్రామ సమీపంలోని గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా ఉపాధ్యాయుడు సాయంతో గెడ్డను దాటుకుంటూ పాఠశాలకు వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరి నాగు హల్‌చల్



రైవాడలో గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: మండలంలోని రైవాడలో భారీ గిరి నాగు హల్‌చల్ చేసింది. రైవాడ ఎస్సీ కాలనీలోని ఓ పూరి గుడిసెలో గురువారం గిరి నాగు ప్రవేశించింది. సుమారు 12 అడుగుల పొడవుతో తాటాకుల మధ్య తిష్ట వేసింది. బుసలు కొడుతున్న చప్పుడు రావడంతో గుడిసెలో నివాసం ఉంటున్న వారు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు ఫారెస్టు అధికార్ల ద్వారా స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. ఆయన సుమారు గంట పాటు శ్రమించి గిరినాగును పట్టుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మారుమూల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం

చింతూరు: పీఎం జన్‌మన్ యోజన పథకం కింద మారుమూల గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు విద్యుత్‌శాఖ డీఈ యూసఫ్ తెలిపారు. గురువారం చింతూరులో ఆయన మాట్లాడుతూ పథకంలో భాగంగా పదేళ్ల నుంచి విద్యుత్‌కు నోచుకోని మారుమూల గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేసి 750 మందికి ఉచితంగా సర్వీసు వైరు, బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ మలాకీ, ఏఈ శ్రీనివాస్, జేఈ మహేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

పర్యాటకుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు



ప్రత్యేక టూర్‌ల వివరాలను వెల్లడిస్తున్న క్రాంతి సావర్కర్

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాల సందర్శించాలనుకునే భక్తులు, పర్యాటక యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెడుతున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచే పలు జాతీయ, అంతర్జాతీయ ప్యాకేజీలను మొట్టమొదటిసారి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఎల్‌టీసీ, ఎల్‌ఎఫ్‌సీ వంటి సదుపాయాలు కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీలు కాకుండా డైరెక్టుగా కస్టమర్స్‌కు కావలసిన ప్యాకేజీలను కూడా రూపొందిస్తున్నా మన్నారు. సమావేశంలో ఆమెతో పాటు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ (భువనేశ్వర్) సంఘమిత్ర రౌల్, సిబ్బంది పాల్గొన్నారు.

టూర్‌ల వివరాలు

మేజికల్ థాయ్‌లాండ్ : ఈ టూర్ విశాఖలో మొదలై, విశాఖలో ముగుస్తుంది. మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7న మొదలై 12వ తేదీన ముగుస్తుంది. విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలోని నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారి వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లోని గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. భోజనం, అల్పాహారం, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సియింగ్, ఇన్సూరెన్స్‌తో కలిపి ఒకొక్కరికి రూ.57,815.

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీన విశాఖలో ముగుస్తుంది. దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుషోక్కడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్ సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి రూ.38,005 చార్జీ చేస్తారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర (విశాఖ నుంచి) : మానస్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో దేవ్‌భూమి ఉత్తరాంఖండ్ యాత్ర. ఇది విశాఖ నుంచి ప్రారంభిస్తున్న మొదటి యాత్ర. మొత్తం థర్డ్ ఏసీ కోచ్‌లతో కూడిన ప్రత్యేక రైలు విశాఖ నుంచి ప్రారంభమవు తుంది. మొత్తం 11రాత్రులు, 12 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ జూలై 26న విశాఖలో ప్రారంభమై ఆగష్టు 8వ తేదీన విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో భీమ్‌టాల్ నైనిటాల్, కైంచి ధామ్, కసర్‌దేవి, కతర్‌మల్ సన్ టెంపుల్, జగదీశ్వర్ ధామ్, గోలు దేవతా, అల్‌మోరా, బైజనాథ్, బాఘేశ్వర్, కౌసని, రాణికేత్ వంటి ప్రాంతాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి రైలు థర్డ్ ఏసీ, హోటల్ వసతి, నాన్ ఏసీ, ఏసీ వాహనాల్లో సైట్ సీయింగ్, భోజనం, టిఫిన్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి స్టాండర్డ్ అయితే రూ.28,020, డీలక్స్ అయితే రూ.35,340 ఉంటుంది.

మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్–92810 30748, సాయిప్రసాద్ – 92814 95847, కేవీ రావు – 95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

ఎండీయూ పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లో సురేంద్ర, లోతా రాంబాబు

పాడేరు : జిల్లాలో పాత పద్ధతితోనే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని ఎండీయూ వాహనాల ద్వారా గ్రామాల వద్దకే వెళ్లి సరకులు అందజేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లో సురేంద్ర, లోతా రాంబాబు డిమాండ్ చేశారు. పాడేరులోని గిరిజన సంఘం కార్యాలయంలో వారు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో సుమారు 221 ఎండీయూ వాహనాలను సమకూర్చి గిరిజనుల ముంగిటే రేషన్ సరుకులు అందించిందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రేషన్ డిపోల నుంచి గ్రామాలకు సుమారు 20 కిలోమీటర్ల దూరం పైగానే ఉంటుందన్నారు. గిరిజనులు అంత దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోలేరని స్పష్టం చేశారు. దీంతో పస్తులుంటే పరిస్థితులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు వస్తున్న పుకార్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి క్లారిటీ ఇవ్వాలన్నారు. ఎండీయూ వ్యవస్థ రద్దు చేస్తే జిల్లాలో సుమారు 442 మంది గిరిజన యువకులు ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పందించాలని లేని పక్షంలో గిరిజనులతో కలిసి ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు.

గిరిజనులకు ఇబ్బందులే

రంపచోడవరం: ప్రతీ ఇంటికి వాహనాలు ద్వారా నిత్యావసరాలు, బియ్యం పంపిణీ నిలిపివేయడం వలన ఏజెన్సీలో అనేక గ్రామాల గిరిజనులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పెదగెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్ చెప్పారు. గ్రామాల్లో డిపోలు ఐదారు కిలోమీటర్లు దూరంలో ఉంటాయని, లబ్ధిదారులు డిపోకు వెళ్లి బియ్యం, నిత్యావసరాలు తెచ్చుకోవాలంటే కాలినడకే శరణ్యమని చెప్పారు. సరుకులు తీసుకుని వాటిని మోసుకుని కాలినడకన ఇంటికి చేరుకోవాల్సిన దుస్థితి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏజెన్సీలో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ద్వారా ఇంటింటికీ సరకుల పంపిణీ కొనసాగించాలని కోరారు.

5 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు గంజాయి స్మగ్లర్లు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



పట్టుకున్న గంజాయి నిందితులతో ఎస్‌ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కుజభంగి జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన బైకులను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కుజభంగి జంక్షన్ వద్ద గురువారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టారు. వీరిని చూసి రూడకోట నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తులు రెండు బైకులను వదిలేసి పారిపోతుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. బైకుల వద్ద బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. నిందితులను అరెస్ట్ చేసి, గంజాయిని, రెండు బైకులను సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన 5 కిలోల గంజాయి విలువ రూ.15 వేలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వారిలో హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన కొర్ర సీతారాం, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చర్లపల్లికి చెందిన కర్రి శ్రీశైలం, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ బాడపాదర్ గ్రామానికి చెందిన పాంగి సుంద్రుగా గుర్తించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీలో ఏఎస్‌ఐ తిరుపతి, పోలీసులు, హోంగార్డులు నాగేష్, పడాల్ పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు: త్రుటిలో తప్పిన ప్రమాదం

- బాధిత కుటుంబానికి నేతల పరామర్శ



డి.కుమ్మరిపుట్టులో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ డి.కుమ్మరిపుట్టు గ్రామంలో బుధవారం రాత్రి భారీ వర్షంతో కూడిన ఈదురు గాలులకు మామిడి చెట్టు కొర్రా ప్రభు ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కొడుకు బాబితో తల్లి లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటినా వారిని ఇంటి నుంచి బయటకు తీశారు. తల్లి, కొడుకులకు చిన్న చిన్న గాయాలు కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంటి పైకప్పు రేకులు అంతా పూర్తిగా ధ్వంసమయ్యాయి. గోడలు బీటలు వారాయి. నిలువ నీడ కరువై రోడ్డున్న పడ్డామని, తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచ్ పాండురంగస్వామి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ నేత జయదేవ్‌లు గురువారం డి.కుమ్మరిపుట్టు గ్రామానికి వెళ్లి ప్రభు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని వారంతా కోరారు.

ప్లంబింగ్‌లో నిరుద్యోగులకు శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు సుమారు 3 నెలల పాటు ప్లంబింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవి కుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి కౌషల్ వికాస్ యోజనం 4.0 (పీఎంకేవీవై) పథకం కింద అభ్యర్థులందరికీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న నేక్ శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. మహిళలకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, శిక్షణ పూర్తిగా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు 9866883199 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు జిల్లా పరిషత్ దగ్గర ఉన్న నేక్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

హుషారుగా ఏరువాక



హుకుంపేట మండలం గరుడాపల్లిలో పంట భూముల్లో నీటి నిల్వలు



పాడేరు మండలం చింతలవీధిలో నారుమడులకు దమ్ము పనులు చేస్తున్న గిరిజన రైతు

- వ్యవసాయానికి మేలు చేస్తున్న వర్షాలు
- లోతట్టు భూముల్లో నీటి నిల్వలు పుష్కలం
- సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నం

సాక్షి,పాడేరు: మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. రోజూ కురుస్తున్న వర్షాలతో పంట భూముల్లో నీటి నిల్వలు పెరగడంతో వరి వ్యవసాయానికి ఎంతో మేలు చేశాయి. దీంతో గిరిజన రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత వారం రోజుల నుంచి మన్యంలో ఏరువాక పనులు హుషారుగా జరుగుతున్నాయి. పంట భూముల్లో దుక్కి,దమ్ము పనులు, నారుమడుల తయారీ పనుల్లో గిరిజనులు శ్రమిస్తున్నారు. పంట భూముల్లో దమ్ము పనులు, గట్టు చెక్కే పనులు చేస్తున్నారు. జిల్లాలో 59వేల హెక్టార్ల విస్తీర్ణంలో గిరిజన రైతులు ఏటా వరిపంటను సాగుచేస్తారు. ఈ ఏడాది కూడా వాతావరణం అనుకూలించి, వర్షాలు విస్తారంగా కురవడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జిల్లా వ్యాప్తంగా జోరందుకున్నాయి. కొన్ని మండలాల్లో కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలతో పంట భూములు చెరువులను తలపిస్తున్నాయి. ఖరీఫ్ వ్యవసాయానికి ఈ వర్షాలు అనుకూలంగా ఉండడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా వేసిన నారుమడులు కూడా ఆశాజనకంగా పెరుగుతుండడంతో ఆయా భూముల్లో దమ్ము పనులు చేసి వరినాట్లకు గిరిజన రైతులు సిద్ధమవుతున్నారు.

ఆగస్టు నాటికి కేకే లైన్ డబ్లింగ్ పనుల పూర్తి



టన్నెల్ వద్ద బ్లాస్టింగ్ (పేలుడు) పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో 100 కిలోమీటర్లు మేర డబ్లింగ్ పనులు ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కేకే లైన్‌లో జరుగుతున్న రెండో లైన్ పనులను కొత్తవలస–అరకు స్టేషన్‌ల మధ్య ఆయన పరిశీలించారు. గురువారం ఫేస్ బ్లాస్టింగ్ ద్వారా బొడ్డవర – శివలింగపురం మధ్య గల 5వ నంబర్ గుహ వద్ద సుమారు 1.4 కిలోమీటర్లు పొడవైన గుహను తొలగించడం ఓ మైలురాయి అని తెలిపారు. ఈ మార్గంలో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, కష్టతరమైన బొడ్డవర–శివలింగపురం మార్గంలో గల 6 టన్నెల్స్‌లో 4 టన్నెల్స్ నిర్మాణం చేపట్టి, ఇప్పటికే పూర్తిచేసినట్లు తెలిపారు.

మార్చి 2026 కల్లా ఈ లైన్ పూర్తి చేసే దిశగా పనులు పూర్తి చేస్తున్నట్లు డీఆర్‌ఎం తెఇపారు. 189 కిలోమిటర్లు పొడవైన కోరాపుట్–కొత్తవలస సెక్షన్‌లో ఇప్పటి వరకు 96.45కిలోమీటర్ల మేర రెండో లైన్ పనులు పూర్తిచేసినట్లు, ఆగస్టు 15వ తేదీకి 100కిలో మీటర్లు పూర్తి కావస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌కుమార్, వాల్తేర్ డివిజన్ ఇతర ఉన్నతాదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.